నిర్లక్ష్యపు నీడలు.. అతిథులకు అవస్థలు

- శిథిలావస్థకు చేరుకుంటున్న ఆర్ అండ్ బీ బంగ్లా
- భక్తులు, ప్రజల సౌకర్యార్థం అభివృద్ధి చేయాలంటున్న స్థానికులు



పాడుబడుతున్న నాగిరెడ్డిపల్లెలోని ఆర్ అండ్ బీ అతిథి గృహం



పంచాయతీ అధికారుల తీరుతో డంపింగ్ యార్డును తలపిస్తున్న అతిథి గృహం ఆవరణ

నందలూరు : మండల కేంద్రంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ అరవపల్లిలోని ఆర్ అండ్ బీ అతిథి గృహం అపరిశుభ్రతకు అడ్డాగ మారింది. రోడ్డు భవనాల అతిథి గృహం శిథిలావస్థకు చేరుకుంది. బ్రిటిష్ కాలం నుంచి ఎవరైనా నేతలు, అధికారులు వీఐపీలు వస్తే నందలూరులో ఉన్న ఒకే ఒక విడిది కేంద్రం ఆర్ అండ్ బీ బంగ్లానే, ఒకప్పుడు అధికారులతో వీఐపీ నాయకులతో ఒక వెలుగు వెలిగిన ఈ బంగ్లా నేడు శిథిలావస్థకు చేరుకుంది. పంచాయతీ వారు బంగ్లాలో ఒక ట్రాక్టర్‌ను పెట్టి అక్కడే చెత్త వేస్తుండటంతో చుట్టుపక్కల గృహాల వారు దుర్వాసనతోపాటు దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నారు. ఆర్ అండ్ బీ అధికారులు అతిథి గృహాన్ని పట్టించుకోకపోవడంతో అపరిశుభ్రత పెరిగిపోయింది. బంగ్లాలోని ఫర్నీచర్ మొత్తం పనికి రాకుండా పోయింది. తాళాలు వేయకపోవడంతో మందుబాబులకు ఇతర అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా ఉండేది. ఆ తర్వాత తాళాలు తీసుకున్న పంచాయతీ అధికారులు బంగ్లాను వాడుకోవడం మొదలుపెట్టారు. అప్పటి నుంచి బంగ్లా మొత్తం శిథిలావస్థకు చేరుకునే స్థితికి చేరింది. ఆర్ అండ్ బీ బంగ్లా శుభ్రంగా ఉన్న సమయంలో గ్రామంలోని పలువురు వేసవిలో చెట్ల నీడన సేదతీరేవారు. గతంలో ఆర్ అండ్ బీ అతిథి గృహం పర్యాటకులు, అధికారులు, రాజకీయ నాయకులకు ఉండటానికి సౌకర్యంగా ఉండేది. నందలూరుకు బయటి వారు వస్తే అతిథిగృహాన్ని ఆశ్రయించేవారు. ఇప్పుడు అది ఎందుకు పనికిరాకుండా పోవడంతో బయట నుంచి వచ్చి 1, 2 రోజులు నందలూరులో ఉండాలనుకునే వారు అటు కడపకో లేదా ఇటు రాజంపేటకో వెళ్లాల్సిన పరిస్థితి. ఇప్పటికైనా ఆర్ అండ్ బీ అధికారులు చొరవ చూపి అతిథిగృహానికి పూర్వవైభవం తీసుకురావాలని మండల వాసులు కోరుకుంటున్నారు.

అందుబాటులోకి తేవాలి



రాజంపేట నియోజకవర్గంలో నందలూరు మండలం అత్యంత కీలకం. సౌమ్యనాథ స్వామి ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తుల వస్తుంటారు. ఈ నేపథ్యంలో భక్తులు బస చేసేందుకు మండలంలో అనువైన ప్రదేశం లేదు. ఉన్న ఏకైక ఆర్‌అండ్ బీ బంగ్లాను కూడా పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. ఇప్పటికైనా అభివృద్ధి బాట పట్టించి అందుబాటులోకి తీసుకురావాలి.

– గుండు మల్లికార్జునరెడ్డి, నందలూరు

వసతి గృహం ఉన్నా.. లేనట్లే



ఆర్ అండ్ బీ అతిథి గృహం గతంలో ఇతర ప్రాంతాల వారికి ఎంతోగానో సౌకర్యంగా ఉండేది. ప్రస్తుతం అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతో మరుగునపడటమే కాక డంపింగ్ యార్డుగా మారడం దౌర్భాగ్యం. నందలూరు చుట్టు పక్కల పర్యాటక ప్రదేశాలు ఎన్నో ఉన్నాయి. ఇక్కడ అతిథి గృహం అభివృద్ధిపై అధికారులు దృష్టి సారించి అందుబాటులోకి తీసుకురావాలి.

– సోమిశెట్టి ప్రభాకర్, నందలూరు

ఆసక్తికి అనుగుణంగా కోర్సును ఎంచుకోవాలి



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న టీచర్ గౌస్ మొహిద్దిన్

పెనగలూరు : ఇంటర్మీడియట్ తరువాత విద్యార్థులు తమ ఆసక్తికి అనుగుణంగా కోర్సులను ఎంచుకోవాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ సహజ బ్లెస్సీ అన్నారు. గురువారం మోడల్ స్కూల్‌లో విద్యార్థులనుద్దేశించి ప్రిన్సిపల్‌తోపాటు గౌస్ మొహిద్దిన్‌లు మాట్లాడారు. ఇంటర్మీడియట్ తరువాత విద్యార్థులు తమ లక్ష్యాలకు తగ్గట్టుగా కోర్సులను ఎంపిక చేసుకోవాలన్నారు. ఏ కోర్సు తీసుకుంటే తనకు భవిష్యత్తు ఉంటుందో ముందే తెలిసివుంటే మంచిదని సూచించారు. ఎంచుకున్న కోర్సులలో రాణించి లక్ష్యాలను చేరుకునేందుకు శ్రమించాలన్నారు. భవిష్యత్తులో ఏమవ్వాలో ఇంటర్‌లో ప్రణాళికలు చేసుకుంటే తరువాత ఎటువంటి ఇబ్బందులు ఉండవని తెలియజేశారు. కార్యక్రమంలో హేమలత, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కోటలో విద్యార్థుల సందడి



కోటలోని కట్టడాలను తిలకిస్తున్న విద్యార్థులు

సిద్దవటం : సిద్దవటం కోటలోని శిల్ప సంపద చాలా బాగుందని కడపలోని వేదాస్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్ ధీరజ్ తెలిపారు. సిద్దవటంలోని మట్లి రాజులకోటను గురువారం ఆ పాఠశాల విద్యార్థులు 200 మంది కోటను సందర్శించారు. ఈ సందర్భంగా వారు కోటలోని కట్టడాలను తిలకించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాబ్ మేళాకు స్పందన



మాట్లాడుతున్న ప్రొఫెసర్ రఘుబాబు

రైల్వేకోడూరు : రైల్వేకోడూరులోని స్థానిక డిగ్రీ కళాశాల నందు బుధవారం ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు 286 మంది అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోగా 122 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు వైవీయూ డీన్ ప్రొఫెసర్ రఘు బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ పెంచలయ్య, డైరెక్టర్ పి.శ్రీనివాసులు, అదనపు నైపుణ్యాభివృద్ధి అధికారి ఆరీఫ్, జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో ప్రతిభ



వ్యాసరచన పోటీలలో పాల్గొన్న విద్యార్థులు

సంబేపల్లి : మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ పాఠశాలలో గురువారం వారధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులలో తరుణ్‌కుమార్ గౌడ్, చిలకమ్మ, మౌనికలు జిల్లా స్థాయిలో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీలకు ఎంపికై నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ తెలిపారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

ఆరోగ్యాన్ని మించిన ఆస్తి లేదు



నమూనాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పుల్లంపేట : ఆరోగ్యాన్ని మించిన ఆస్తిలేదని మండల పరిధిలోని దళవాయిపల్లి ఆదర్శ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమణ అన్నారు. గురువారం ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఆరోగ్య, అనారోగ్య ఆహారాల గురించి వివరించారు. ఆహారపు అలవాట్ల పట్ల అవగాహన కలిగి ఉండాలని, జంక్ ఫుడ్‌ను తీసుకోరాదని సూచించారు. ఆకుకూరలు, పండ్లు, చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో నమూనాలు చేసి ప్రదర్శించారు.

నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కొత్తపల్లి శ్రీనివాసులు ఆచారి సతీమణి రామలక్ష్మమ్మ మృతిచెందారు. విషయం తెలుసుకున్న వైఎస్ఆర్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి ఆమె మృతదేహానికి నివాళులర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన వెంట భూమన శంకర్‌రెడ్డి, ఆకేపాటి జగదీశ్వర్‌రెడ్డి, హస్తవరం సుబ్బరామిరెడ్డి, గుండు మల్లికార్జునరెడ్డి, గంగిరెడ్డి, దేరంగుల శివయ్య, మహబూబ్‌బాషా, ఎలుమలై, ఎముక దుర్గయ్య, మధురాజు, సుబ్రమణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లెలో..

ఓబులవారిపల్లె : రైల్వేకోడూరు నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు నారాయణమ్మ తల్లి గంగమ్మ (60) అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాయలసీమ జోన్ బూత్ కమిటీ అధ్యక్షులు తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ స్థానిక నాయకులు గంగమ్మ మృతదేహానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

చేపల ఉత్పత్తి పెంచుదాం



చేప పిల్లలను వదులుతున్న నాయకులు

రాయచోటి టౌన్ : రాయచోటి రూరల్ పరిధిలోని శిబ్యాల గ్రామం ఇరగాని చెరువులో రాయచోటి మార్కెట్ కమిటీ చైర్మన్ అనుంపల్లె రాంప్రసాద్ రెడ్డి లక్ష చేప పిల్లలను గురువారం వదిలిపెట్టారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

కార్పొరేట్లకు కట్టబెట్టడం విరమించుకోవాలి

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై వెనక్కి తగ్గాలంటూ వైఎస్సార్‌సీపీ నేతల హితవు



రచ్చబండలో పాల్గొన్న ధ్వజారెడ్డి, నాయకులు

రైల్వేకోడూరు అర్బన్ : మెడికల్ కాలేజీల కార్పొరేట్లకు కట్టబెట్టడాన్ని ప్రభుత్వం విరమించుకునే దాకా పోరాటం ఆగదని వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వెంకటరెడ్డిపల్లి పంచాయతీ ఎస్‌టీఎస్ గిరిజన కాలనీలో గురువారం రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. కూటమి పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ధ్వజారెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల నాయకత్వంలో కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను కట్టలేని దుస్థితిలో ఉందని విమర్శించారు. గత ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు అందకుండా విధ్వంసకర పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు అప్పులు తేవడం తమ వారికి దోచిపెట్టే పనులు తప్ప మరేమీ చేయడంలేదని ఆరోపించారు. కేవలం రాజకీయ కక్షలకు పాల్పడుతూ వైఎస్సార్‌సీపీ శ్రేణులను వేధింపులు, అక్రమాలు, దౌర్జన్యాలు, అక్రమ కేసులు పెడుతూ కాలం వెలిబుచ్చుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రత్నమ్మ, సీహెచ్ రమేష్, మండల నాగేంద్ర, సర్పంచ్‌లు హరికృష్ణారెడ్డి, బుడుగు శివయ్యలు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సుబ్బరామరాజు, ఆనంద్‌యాదవ్, సుదర్శన్‌రాజు, ఆర్వీ రమణ, దార్ల చంద్రశేఖర్, రామకృష్ణ, గోపీ, గని, మహేశ్వర్‌రెడ్డి, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

కోటి సంతకాలతో ప్రైవేటీకరణను అడ్డుకుందాం

- బృహత్ సంకల్పంతో మెడికల్ కాలేజీల నిర్మాణానికి నాడు వైఎస్ జగన్ నాంది
- కూటమి ప్రభుత్వ నిర్ణయంతో పేద, మధ్య తరగతికి వైద్యం, విద్య దూరం
- రచ్చబండ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ధ్వజం



కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు

రామాపురం : ప్రైవేటీకరణతో పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరమవ్వడమే కాకుండా పేదలకు సర్కారు వైద్యం దూరమవుతుందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం రామాపురం మండలంలోని పలు పంచాయతీలలో ఆయన రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ మొదటి నుంచి చంద్రబాబుది ప్రైవేటీకరణ విధానమేనని తెలిపారు. గత ప్రభుత్వంలో బృహత్ సంకల్పంతో సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 17 మెడికల్ కాలేజీలను నిర్మించతలపెట్టారన్నారు. ఇప్పటికే ఐదు కాలేజీలు అందుబాటులోకి రాగా, మిగిలిన కాలేజీలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. గ్రామాల్లో పేదలకు వైద్యం అందించేందుకు ఈ నిర్ణయం ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఇవేవి పట్టని చంద్రబాబు పీపీపీ విధానం పేరుతో కార్పొరేట్లకు కాలేజీలను అప్పగించడమే కాకుండా దానిని సమర్థించుకోవడం రాష్ట్ర ప్రజలను మోసగించడమేనన్నారు. రూ.3 వేల కోట్లు మెడికల్ కాలేజీలకు ఖర్చుచేయలేని స్థితిలో చంద్రబాబు ప్రభుత్వం ఉందా అని ప్రశ్నించారు. పేద, మధ్య తరగతి ప్రజల అభ్యున్నతి, ఆరోగ్యాలపై కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఎలాంటిదో ఈ నిర్ణయం బయటపెట్టిందని దుయ్యబట్టారు. కాలేజీల ప్రైవేటీకరణతో పేద, మధ్య తరగతి ప్రజలకు వచ్చే కష్టాలను శ్రీకాంత్‌రెడ్డి వివరించారు. అలానే చంద్రబాబు తీసుకున్న ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కోటి సంతకాలు సేకరణకు శ్రీకారం చుట్టామన్నారు. కార్యక్రమానికి గ్రామగ్రామన స్పందన రావడం చంద్రబాబు నిర్ణయానికి చెంపపెట్టు అని తెలియజేశారు. ఇప్పటికైనా ప్రజలకు మంచి చేసే నిర్ణయాలు తీసుకునేలా కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. అలానే ప్రతి గ్రామంలో వైఎస్సార్‌సీపీ కమిటీలు ఏర్పాటు చేసి పార్టీని పటిష్టం చేసుకుందామని, పార్టీ కోసం కష్టపడి పని చేసే ప్రతి కార్యకర్తకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గడికోట జనార్దన్ రెడ్డి, సర్పంచ్‌లు వెంకట రెడ్డి, భూషణ్ రెడ్డి, భుమారపు రామాంజులు, మాజీ సర్పంచ్‌లు మురళీమోహన్ రెడ్డి, రాజారెడ్డి, గోపాల్ రెడ్డి, సింగల్ విండో మాజీ అధ్యక్షుడు ఆదినారయణ రెడ్డి, పెద్దిరెడ్డి, విశ్వనాథ రెడ్డి, చలమారెడ్డి, హరినాథరెడ్డి, సుబ్బారెడ్డి, ప్రవీణ్ రెడ్డి, అమర్నాథ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సగినాల శివ శంకర్, కార్యకర్తలు, అభిమానులు ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా బోయినపల్లి గంగమ్మ జాతర



గంగమ్మతల్లికి మొక్కులు చెల్లించుకుంటున్న ఎమ్మెల్యే ఆకేపాటి



పూజలందుకున్న గంగమ్మ

రాజంపేట రూరల్ : గంగమ్మ తల్లి జాతరను మండలంలోని కె.బోయినపల్లిలో గురువారం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకున్నారు. జాతర సందర్భంగా గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. ప్రతి కుటుంబంలోని వారు తమ బంధువులు, స్నేహితులను ఇతర రాష్ట్రాల నుంచి సైతం కబురు పంపి ఆహ్వానించారు. వేల సంఖ్యలో భక్తులు బోయినపల్లికి రావటంతో అక్కడ భక్తిబావం వెదజల్లింది. గంగమ్మకు జేజేలు పలుకుతూ మొక్కులు చెల్లించుకున్నారు. ఇదే క్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి ఈ వేడుకలలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, అన్నమాచార్య యూనివర్సిటీ ప్రో చాన్సలర్ చొప్పా అభిషేక్‌రెడ్డిలతో కలిసి విచ్చేసిన ఎమ్మెల్యే ఆకేపాటికి నిర్వాహకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గంగమ్మతల్లి దీవెనలతో ప్రజలంతా చల్లంగా ఉండాలని పూజలు చేసినట్లు ఎమ్మెల్యే ఆకేపాటి తెలియజేశారు. ఈ వేడుకలలో అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేకతను తట్టుకోలేకే మహిళా నేతపై విమర్శలు



ఎస్.మహిత

రాయచోటి : చిత్తూరు జిల్లా గంగాధర్ నెల్లూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకురాలు కృపాలక్ష్మికి ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే వీఎం థామస్ క్షమాపణ చెప్పాలని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జ్ ఎస్.మహిత డిమాండ్ చేశారు. గురువారం రాయచోటిలోని పత్రికలకు అందజేసిన ప్రకటనలో వారు మాట్లాడుతూ అధికార పార్టీ బలంతో మహిళలు అన్న ఆలోచన లేకుండా మాజీ మంత్రి నారాయణ స్వామి కుమార్తె కృపా లక్ష్మిని కించపరిచేలా వ్యాఖ్యలు చేయడాన్ని ఆమె ఖండించారు. కల్తీ మద్యం తయారీలో పీకల్లోతు కురుకుపోయిన కూటమి ప్రభుత్వం పట్ల రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర వ్యతిరేకత వినిపిస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ప్రజల మద్దతుతో మహిళలు ముందుకు వచ్చి కల్తీ మద్యం తయారీపై అన్ని నియోజకవర్గాల్లోని ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌ల ఎదుట నిరసన తెలియపరిచి వినతిపత్రాలు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో గంగాధర్ నెల్లూరు పరిధిలో మాజీ మంత్రి కుమార్తెగా, వైఎస్సార్‌సీపీ నాయకురాలిగా నిరసన కార్యక్రమానికి నాయకత్వం వహించిందన్నారు. నియోజకవర్గ ప్రజలకు అండగా నిలుస్తూ ప్రజా వ్యతిరేక ప్రభుత్వం పట్ల పోరాటం చేస్తున్న ఓ మహిళను ఎమ్మెల్యే స్థాయిలో ఉన్న థామస్ వ్యక్తిగతంగా విమర్శలు చేయడం తగదని ఆమె హితవు పలికారు.

వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి అంకితభావంతో కృషి



ఎస్ఈసీ సభ్యుడు గాలివీటి విజయభాస్కర్‌రెడ్డిని సన్మానిస్తున్న మండల నాయకులు

వీరబల్లి : వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా నియమితులైన మాజీ ఎంపీపీ గాలివీటి విజయభాస్కర్ రెడ్డిని మట్లి పంచాయతీ, వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం ఘనంగా సన్మానించారు. మండల కేంద్రంలోని ఆయన నివాసంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర చేనేత విభాగం ప్రధాన కార్యదర్శి మోడం నాగభూషణం ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు శాలువా, గజమాలలతో సత్కరించారు. విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎంతో నమ్మకంగా మనకందరికీ పదవులు అప్పచెప్పడం జరిగిందన్నారు. ఆయన మనమీద పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ముచేయకుండా పార్టీ అభివృద్ధికి, ప్రజా సేవకు అంకితభావంతో కృషి చేద్దామన్నారు. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న నయవంచక విధానాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని చెప్పారు. కార్యక్రమంలో తాటిగుట్ల అమర్నాథ రెడ్డి, నాగిరెడ్డి, మోడం మదన్‌మోహన్, నరేంద్ర నాయుడు, ధర్మారెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, బస్సు రెడ్డి, మల్లికార్జున, బండి రమణయ్య, వెంకటరమణ, మాజీ ఉప సర్పంచ్ ఆదినారాయణ, పి.రవీంద్ర, తాంత్ర ప్రభాకర్ నాయుడు, అబ్బూరి వెంకట సుబ్బయ్య, వడ్లమూడి కుమార్ నాయుడు, వెంకటేశ్వర్లు, డక్కీపురం రామనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అనస్తీషియా అసిస్టెంట్‌ల సేవలు ఎనలేనివి



కేక్ కట్ చేసి సంబరాలు చేసుకొంటున్న వైద్యులు, అనస్తీషియా అసిస్టెంట్లు

రాయచోటి టౌన్ : రాయచోటి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో అనస్తీషియా డే సందర్భంగా వేడుకలు గురువారం ఆర్ఎంవో డాక్టర్ డేవిడ్ సుకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనస్తీషియా విభాగం ఒక ప్రత్యేకమైనదన్నారు. ఆపరేషన్ చేసే సమయంలో వారి కృషి విశేషమైనదన్నారు. అనస్తీషియా వైద్యులు, అసిస్టెంట్‌ల సేవలు ఎనలేనివని కొనియాడారు. ఎంతటి ఆపరేషన్ అయినా వారిచ్చే అనస్తీషియాతోనే చేయాల్సి వస్తుందన్నారు. అలాంటి వారి సేవలకు గుర్తుగా అనస్తీషియా దినోత్సవం జరుపుకోవడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో జనరల్ సర్జన్ డాక్టర్ లక్ష్మీప్రసాద్, డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ వెంకట శివ, డాక్టర్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

బస్సుల కోసం అగచాట్లు



పుల్లంపేటలో బస్సుల కోసం వేచి చూస్తున్న మహిళలు

పుల్లంపేట : బస్సుల కోసం మహిళలు తీవ్ర అగచాట్లు పడ్డారు. ఉచిత బస్సుల కారణంగా ఉన్న బస్సులకే కోతలు పెట్టి అరకొర బస్సులను నడుపుతున్న ప్రభుత్వం గురువారం ప్రధాని పర్యటన కారణంగా బస్సులన్ని కర్నూలుకి పంపడంతో ఒకటి, రెండు బస్సులు మాత్రమే రోడెక్కాయి. కళాశాలలకు వెళ్లే విద్యార్థులు బస్సులు లేక కళాశాలలకు వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. పలువురు విద్యార్థులు ఆటోలలో పాఠశాలలకు చేరుకున్నారు. మహిళలు రోడ్లమీద గంటలు తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. పలువురు మహిళలు బస్టాప్‌ల వద్ద సౌకర్యాలు లేక అవస్థలు పడ్డారు. కాగా దాదాపు మూడువేల పైచిలుకు బస్సులను ప్రధాని సభకు తరలించినట్లు సమాచారం.

టపాసుల విక్రయదారులు నిబంధనలు పాటించాలి



మహమ్మద్ రఫీ, ఎస్ఐ

సిద్దవటం : దీపావళి పండుగను ప్రతి ఒక్కరూ సంతోషంగా జరుపుకోవాలని బాణసంచా దుకాణదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ఎస్ఐ మహమ్మద్ రఫీ తెలిపారు.గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలో టపాసుల విక్రయానికి ఐదుగురు దరఖాస్తులు చేసుకున్నారని, ఇందులో ఒకటి సిద్దవటంలో మిగతా నాలుగు మాధవరంలో ఏర్పాటు కానున్నాయని చెప్పారు. బాణసంచా విక్రయదారులు నిబంధనలు కచ్చితంగా పాటించాల్సిన అవసరం ఉందన్నారు. టపాసుల దుకాణాలు జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో కాకుండా గ్రామానికి దూరంగా ఏర్పాటు చేయాలని, ప్రజల భద్రత దృష్ట్యా ఇది అత్యంత ముఖ్యమన్నారు. ప్రతి దుకాణం వద్ద నీరు, ఇసుక, అగ్నిమాపక సౌకర్యాలు అందుబాటులో ఉండాలని తెలియజేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్సు రద్దు చేస్తామని, అధికారుల అనుమతులు లేకుండా ఎవరైనా బాణసంచా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మొరాయించిన గ్రామీణ బ్యాంక్ సర్వర్



లావాదేవీలు జరగక ఖాతాదారుల పడిగాపులు

సిద్దవటం : మండల కేంద్రమైన సిద్దవటంలో గురువారం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ సర్వర్ మొరాయించింది. లావాదేవీలు స్తంభించిపోవడంతో ఖాతాదారులు ఇబ్బందిపడ్డారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో మేనేజర్ సెలవు పెట్టగా ఇద్దరు సిబ్బంది మాత్రమే హాజరయ్యారు. ఉదయం నుంచి సర్వర్ పనిచేయలేదని మహిళా సిబ్బంది చెప్పగా అత్యవసర నగదు లావాదేవీలు జరగక ఖాతాదారులు అవస్థలు పడ్డారు. దాదాపు ఉదయం నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 50 మందికి పైగా బ్యాంకులో నిల్చొని ఉండటం కనిపించింది.

ప్రతిభగల క్రీడాకారులనే ఎంపిక చేయాలి

- డివిజనల్ స్థాయిలో క్రీడాకారులకు అన్ని ఏర్పాట్లు చేయాలి
- డిప్యూటీ డీఈఓ నాగయ్య



అన్నమయ్య కళావేదికను ఉపాధ్యాయులతో కలిసి ప్రారంభిస్తున్న డిప్యూటీ డీఈఓ నాగయ్య

రాజంపేట టౌన్ : ఈనెల 23వ తేదీ నుంచి రాజంపేటలో నిర్వహించే ఎస్‌జీఎఫ్ డివిజన్ స్థాయి క్రీడాకారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టి ప్రతిభగల క్రీడాకారులను జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేయాలని డిప్యూటీ డీఈఓ లంకయ్యగారి నాగయ్య తెలిపారు. స్థానిక బాలికోన్నత పాఠశాలలో గురువారం డివిజన్‌లోని పీఈటీ, పీడీలతో నిర్వహించిన సమావేశంలో డిప్యూటీ డీఈఓ మాట్లాడారు. క్రీడాకారుల ఎంపికలో ఆరోపణలకు తావివ్వకుండా చేపట్టాలన్నారు. ఎంపికలకు ఇంకా సమయం ఉన్నందున కమిటీలు వేసుకొని విజయవంతం చేయాలన్నారు. డివిజన్‌లోని ఏడు మండలాలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటారని, అందువల్ల క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ఇటీవల ప్రభుత్వ హైస్కూల్ క్రీడా మైదానంలో జరిగిన మండల స్థాయి పోటీల్లో క్రీడాకారులకు తాగునీటి సౌకర్యం కల్పించలేదన్న ఆరోపణలు వచ్చాయన్నారు. అందువల్ల డివిజన్ స్థాయి ఎంపికల సందర్భంగా క్రీడాకారులకు సంపూర్ణగా తాగునీటి వసతిని కల్పించాలని ఆదేశించారు. ఎంఈఓ–1 కొండూరు రఘునాథ్‌రాజు, ఎంఈఓ–2 సుబ్బరాయుడు, పుల్లంపేట ఎంఈఓ జి.చక్రధర్‌రాజు మాట్లాడుతూ 23, 24వ తేదీల్లో బాలికోన్నత పాఠశాల క్రీడామైదానంలో గేమ్స్‌కు సంబంధించి, 25వ తేదీ ప్రభుత్వ హైస్కూల్ క్రీడా మైదానంలో స్పోర్ట్స్‌కు సంబంధించిన క్రీడాకారుల ఎంపికలు ఉంటాయన్నారు. ఈ ఎంపికలకు సంబంధించి పీఈటీలు, పీడీలు ముందుగానే ప్రణాళికలు రూపొందించుకొని విజయవంతం చేయాలని తెలిపారు. బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం జయలక్ష్మి మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో నిర్వహించే క్రీడాకారుల ఎంపికలను తమ పాఠశాలలో నిర్వహిస్తుండటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. తొలుత డిప్యూటీ డీఈఓ నాగయ్య బాలికోన్నత పాఠశాలలో దాతల రూ.2 లక్షల ఆర్థిక సహాయంతో నిర్మించిన అన్నమయ్య కళావేదికను ప్రారంభించారు. అనంతరం దాతలు అరవ రమణయ్య, విశ్వనాథనాయుడు, బి.అచ్యుత, వీరప్రసాద్‌లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో డివిజన్ క్రీడా ఎంపికల కో-ఆర్డినేటర్ హమీద్, ఉపాధ్యాయులు, పీఈటీలు, పీడీలు పాల్గొన్నారు.